దారి తప్పుతున్న దళిత బండ్లు

- లబ్ధిదారులను మభ్యపెట్టి చౌకగా వాహన కొనుగోళ్లు
- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల రిజిస్ట్రేషన్ల మార్పిడి
- ఆర్టీఏలో అధికారుల చేతివాటం
- ప్రభుత్వం మారగానే పథకంపై కొరవడిన పర్యవేక్షణ
- ఇదే అదునుగా భావించి చెలరేగుతున్న అక్రమార్కులు
- హుజూరాబాద్‌లో వెలుగు చూసిన అక్రమాల బాగోతం

కరీంనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయం

రాంనగర్ (కరీంనగర్), ఫిబ్రవరి 16: దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం స్ఫూర్తికి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. లబ్ధిదారులు కొనుగోలు చేసిన వాహనాలను అడ్డదారుల్లో హస్తగతం చేసుకొంటున్నారు. ఇందుకు రవాణాశాఖలోని అధికారులు సహకరిస్తున్న తీరు అవినీతికి పరాకాష్టగా నిలుస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం విధించిన నిబంధనలను ఉల్లంఘించి మరీ వాటిని ఇతరుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తున్న బాగోతం హుజూరాబాద్ నియోజకవర్గంలో వెలుగుచూసింది. దళిత బంధు పథకాన్ని తొలుత హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టగా దాదాపు ఎనిమిది వేల మంది లబ్ధిదారులు వాహనాలను కొనుగోలు చేశారు. వీరిలో కొందరు ఆయా వాహనాలను నిత్యం నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. మరి కొందరు అప్పుడప్పుడూ వాటిని వినియోగిస్తున్నారు. ఇలాంటి వాహనాల మీద దళారుల కన్నేశారు. లబ్ధిదారులకు ఎర వేసి, ఆయా వాహనాలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. నిజానికి దళితబంధు వాహనాల రిజిస్ట్రేషన్లను ఐదేండ్లపాటు ఇతరుల పేరిట మార్చడానికి వీలులేకుండా కేసీఆర్ ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నది. ఆయా వాహనాలకు ప్రత్యేక కోడ్‌తో నంబర్లు కేటాయించింది. ఆయా కోడ్ ఉన్న వాహనాలను ఐదేండ్లపాటు ఇతరుల పేరు మీదకు మార్చడానికి వీలు లేదు. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత రవాణాశాఖలోని అక్రమార్కులు ఈ నిబంధనలను గాలికొదిలేస్తున్నారు. దళిత బంధు వాహనాలను కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక కోడ్‌కు బదులుగా సాధారణ నంబర్లు ఇస్తున్నారు. హుజూరాబాద్‌కు చెందిన ఒక ఆర్టీఏ ఏజెంట్ ఈ విషయంలో యాక్టివ్‌గా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. కరీంనగర్ ఆర్టీఏ కార్యాలయంలోని ఒక ఉన్నతాధికారి సహాయంతో ఈ అక్రమానికి తెరలేపినట్టు సమాచారం. అందుకు ఆర్టీఏ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఇతను గతంలో ఖమ్మం జిల్లాలో పనిచేసినప్పుడు ఏసీబీ కేసులో చిక్కి కొంతకాలం విధులకు దూరంగా ఉండటం గమనార్హం. కోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఉద్యోగంలో చేరిన ఈ అధికారి చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమాలకు తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్టీఏ ఏజెంట్‌కు పూర్తిస్థాయిలో సహకరిస్తూ పెద్ద మొత్తంలో దండుకుంటున్నారనే ఆరోపణలొస్తున్నాయి.

ప్రైవేట్ వ్యక్తితో వసూళ్లు!

రవాణా శాఖ కార్యాలయంలో సెక్షన్ సిబ్బంది ఎలాంటి లావాదేవీలు జరిపినా వాటిని పర్యవేక్షణ అధికారి పర్యవేక్షించి అప్రూవ్ చేయాల్సి ఉంటుంది. అయితే, దళితబంధు వాహనాల విషయంలో మాత్రం పర్యవేక్షణ అధికారి సిబ్బంది ప్రమేయం లేకుండా ఒక ప్రైవేట్ వ్యక్తిని నియమించుకొని హుజూరాబాద్‌కు చెందిన ఏజెంట్ ద్వారా ఈ తతంగం నడిపించినట్టు తెలుస్తున్నది. హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన ఒక ఏజెంట్ దళితబంధు వాహనాలను అమ్మేలా చేయడంతోపాటు వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ మార్పిడి చేయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. దీనికి రవాణా శాఖ పర్యవేక్షణ అధికారి కూడా తోడవడంతో భారీగా ముడుపులు ముట్టజెప్పి, వాహనాలకు ఫైనాన్స్ క్లియరెన్స్ లేకున్నా ఇతరుల పేరు మీదికి మార్పిస్తున్నారు. అందుకు సహకరిస్తున్న ఆర్టీఏ అధికారికి ఒక్కో వాహనానికి రూ.లక్ష చొప్పున ముట్టజెప్పినట్టు విశ్వసనీయంగా తెలుస్తున్నది. ఈ ముడుపులన్నీ పర్యవేక్షణ అధికారి కనుసన్నల్లో మెలిగే ప్రైవేట్ వ్యక్తికి అందుతున్నట్టు సమాచారం. రవాణా శాఖ సిబ్బంది లావాదేవీలు, ఏజెంట్లకు సంబంధించిన లావాదేవీల్లో కూడా ఆ ప్రైవేటు వ్యక్తి మామూళ్లు వసూలు చేస్తున్నట్టు కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దళిత బంధు పథకం కింద లబ్ధిదారులు పొందిన వాహనాలను ఎస్సీ వెల్ఫేర్ శాఖకు సమాచారం ఇవ్వకుండా, లబ్ధిదారుడిని కనీసం ప్రశ్నించకుండా ముడుపులు పుచ్చుకొని రిజిస్ట్రేషన్ మార్పిడి చేయడం రవాణా శాఖ అవినీతికి అద్దం పడుతున్నది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

జల్‌శక్తి భేటీకి సర్కారు డుమ్మా

- అతి కీలక భేటీకి ముఖం చాటేసిన రేవంత్ ప్రభుత్వం
- అసెంబ్లీలో శ్వేతపత్రం సాకుతో వాయిదా కోరుతూ లేఖ
- ఇటు అసెంబ్లీలో శ్వేతపత్రమూ విడుదల చేయని వైనం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): నీటిపారుదల రంగం, ప్రాజెక్టులపై ప్రభుత్వం మరోసారి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించింది. ఇప్పటికే ఆలోచన లేకుండా శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌లతోపాటు ఔట్‌లెట్లను కేంద్రానికి అప్పగించేందుకు కాంగ్రెస్ సర్కారు అంగీకరించింది. అటు తరువాత ప్రతిపక్ష పార్టీల ఒత్తిడితో దిగొచ్చింది. అయితే, అసెంబ్లీ వేదికగా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాజెక్టులను అప్పగించబోమని బీరాలు పలికినా, ఆచరణలో మాత్రం సీరియస్‌గా తీసుకున్న దాఖలాలు కనిపించటంలేదు. ప్రాజెక్టుల అప్పగింత అంశంపై కేంద్ర జల్‌శక్తిశాఖ శుక్రవారం నిర్వహించ తలపెట్టిన సమావేశాన్ని వాయిదా వేయాలని కోరడమే అందుకు నిదర్శనం. ఇరిగేషన్‌పై శ్వేత పత్రం విడుదల చేయాల్సి ఉన్నదనే సాకుతో సమావేశం వాయిదా కోరిన రాష్ట్ర సర్కారు, ఇటు అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని కూడా విడుదల చేయకుండా తప్పించుకొన్నది.

రాష్ట్రానికి అతిముఖ్యమైన సమావేశం

శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి నెలరోజుల్లోగా అప్పగించాలని జనవరి 17వ తేదీన నిర్వహించిన సమావేశంలో ఇరు రాష్ట్రాలకు కేంద్ర జల్‌శక్తిశాఖ స్పష్టంగా చెప్పింది. దీనిపై కేఆర్‌ఎంబీలో చర్చించుకుని ప్రాజెక్టుల అప్పగింత, నిర్వహణకు యాక్షన్ ప్లాన్‌తో రావాలని నిర్దేశించింది. అందుకు తెలంగాణ ప్రభుత్వం తలూపింది. ఈ నెల 1వ తేదీన కేఆర్‌ఎంబీ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కూడా ప్రాజెక్టుల అప్పగింతకు తెలంగాణ ప్రభుత్వం మరోసారి అంగీకారం తెలిపింది. ఈసారి మరో అడుగు ముందుకేసి ప్రాజెక్టుల నిర్వహణకు అధికారులను కూడా అప్పగించేందుకు ఒప్పుకున్నది. అయితే ప్రాజెక్టుల అప్పగింత వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ తీవ్రస్థాయిలో మండిపడ్డది. దీంతో ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోమని అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది. కాగా, ప్రాజెక్టుల అప్పగింత అంశంపై తదుపరి సమావేశాన్ని 16వ తేదీన నిర్వహిస్తామని కేంద్ర జల్‌శక్తిశాఖ గతంలోనే వెల్లడించింది. రాష్ట్ర సర్కారుకు సమాచారం అందించింది. ఈ సమావేశానికి కచ్చితంగా హాజరవుతామని, ప్రాజెక్టుల అప్పగింత అంశంపై తెలంగాణ రాష్ట్ర అభిప్రాయాలను, అభ్యంతరాలను కరాఖండిగా తేల్చిచెప్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోకలిసి సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. తీరా ఆ సమావేశం రోజున ప్రభుత్వం డుమ్మా కొట్టింది. అసెంబ్లీలో నీటిపారుదల రంగంపై శ్వేతపత్రం విడుదల చేయాల్సి ఉన్నదని, అందువల్ల సమావేశాన్ని మరో తేదీకి వాయిదా వేయాలని జల్‌శక్తిశాఖకు లేఖ రాసింది. ఇటు అసెంబ్లీలో శ్వేత పత్రం కూడా విడుదల చేయలేదు.

నాడు కేసీఆర్‌పై అడ్డగోలు విమర్శలు..

ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపడుతుంటే కేంద్రం నిర్వహించిన 2వ అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి కేసీఆర్ హాజరుకాకుండా కావాలనే వాయిదా కోరారని, రాష్ట్రానికి ప్రాణసంకటమైన అంశాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగానూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. మరి ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమిటని ఇంజినీర్లు, తెలంగాణవాదులు నిలదీస్తున్నారు. ప్రాజెక్టుల అప్పగింతతో తెలంగాణ జలహక్కులకు తీవ్ర విఘాతం వాటిల్లుతుందనేది సత్యం. అంతటి ప్రాధాన్యమున్న అంశంపై కేంద్రం నిర్వహించే సమావేశానికి హాజరై ప్రాజెక్టుల అప్పగించబోమని స్పష్టంగా చెప్పాల్సి ఉన్నా, సమావేశానికి ముఖం చాటేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

547 ఉద్యోగాల ఫలితాలు విడుదల

- అందుబాటులో ఆరు పరీక్షల జనరల్ ర్యాంకింగ్ జాబితాలు
- త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ లిస్టు వెల్లడి : టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో భాగంగా 547 ఉద్యోగాల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. శుక్రవారం టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీబీపీవో), డ్రగ్ ఇన్‌స్పెక్టర్, హార్టికల్చర్ ఆఫీసర్, ఇంటర్ విద్యలో లైబ్రేరియన్, రవాణా శాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. మెరిట్ ప్రకారం జనరల్ ర్యాంకింగ్ జాబితాలను అందుబాటులో ఉంచింది. త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తామని వెల్లడించింది.

ప్రకటించిన ఫలితాలు ఇవే..

- మున్సిపల్‌శాఖలో 175 టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పోస్టులకు 2023 జూలై 8న పరీక్ష నిర్వహించారు. ఫలితాలను విడుదల చేయగా, జోన్ 7కు చెందిన ఓ అభ్యర్థి 300 మార్కులకు 254.032 మార్కులతో టాపర్‌గా నిలిచారు. మొత్తం 20,123 మంది మెరిట్ జాబితాను విడుదల చేయగా, ఓ అభ్యర్థి అతి తక్కువగా 35 మార్కులతో చివరి స్థానంలో నిలిచారు.
- డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో 18 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు 2023 మే 19న పరీక్ష జరిగింది. మొత్తం 450 మార్కులకు పరీక్ష నిర్వహిస్తే మల్టీజోన్ -1కు చెందిన ఓ మహిళ 347.820 మార్కులతో టాపర్‌గా నిలిచారు. 10,630 మంది అభ్యర్థులతో మెరిట్ లిస్టు విడుదలైంది. ఓ అభ్యర్థికి అతి తక్కువగా 23 మార్కులొచ్చాయి.
- ఉద్యానశాఖలో 22 హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి 2023 జూన్ 17న పరీక్ష జరిగింది. మల్టీజోన్ -1కు చెందిన ఓ అభ్యర్థి 450 మార్కులకు 318 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. 1,035 మంది ఫలితాలను ప్రకటించగా, 99.088 మార్కులతో చివరి స్థానంలో ఓ మహిళా అభ్యర్థి నిలిచారు.
- ఇంటర్ విద్యలో 71 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి గత ఏడాది మే 17న పరీక్ష నిర్వహించగా, 450 మార్కులకు 294.932 మార్కులతో మల్టీజోన్ -2కు చెందిన ఓ అభ్యర్థి టాపర్‌గా నిలిచాడు. 2,634 మంది మెరిట్‌లిస్ట్‌లో ఓ అభ్యర్థి అతి తక్కువగా 88.176 మార్కులు సాధించాడు.
- రవాణా శాఖలో 113 ఏఎంవీఐ పోస్టుల భర్తీకి జూన్ 28న పరీక్ష నిర్వహించగా, 450 మార్కుల పరీక్షలో 374.873 మార్కులతో మల్టీజోన్ -2 అభ్యర్థి ఒకరు టాపర్‌గా నిలిచాడు. మొత్తం 4,703 మంది ఫలితాల్లో ఓ అభ్యర్థి 93.465 మార్కులతో చివరిస్థానంలో నిలిచాడు.
- వ్యవసాయశాఖలో 148 అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి 2023 మే 16న పరీక్ష నిర్వహించారు. మొత్తం 400 మార్కులకు పరీక్షను నిర్వహించగా, 352.047 మార్కులతో మల్టీజోన్ -2 చెందిన ఓ అభ్యర్థి టాపర్‌గా నిలిచాడు. మొత్తం 6,511 మంది మెరిట్ జాబితాను విడుదల చేయగా, అతి తక్కువగా ఓ మహిళా అభ్యర్థికి 91 మార్కులొచ్చాయి.

వీఐటీ– ఏపీ క్యాంపస్‌లో అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : వీఐటీ–ఏపీ క్యాంపస్‌లో తులనాత్మక చట్టంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు వీఐటీ–ఏపీ వర్సిటీ వీసీ ఎస్వీ కోట రెడ్డి తెలిపారు. 15న సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన ఈ సదస్సు.. 17న ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో ''అంతర్జాతీయ వాణిజ్య వివాదాల పరిష్కారంలో సాంకేతికత అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, అవకాశాలు, సవాళ్లు'', దేశంలో తులనాత్మక ప్రజా చట్టం, అభ్యాసాలపై చర్చిస్తున్నట్టు వివరించారు. శుక్రవారం సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ రవీంద్ర భట్ మాట్లాడుతూ.. దేశంలోని అంతర్జాతీయ స్థాయి న్యాయ వ్యవస్థ ప్రాధాన్యాన్ని వివరించారు.

3 లక్షలతో దొరికిన దవాఖాన సూపరింటెండెంట్

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ నల్లగొండ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ లచ్చూ నాయక్

నీలగిరి, ఫిబ్రవరి 16 : లంచం తీసుకుంటూ నల్లగొండ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్న అనే కాంట్రాక్టర్ టెండర్ ద్వారా నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు కొన్నేండ్లుగా మందులు సరఫరా చేస్తున్నారు. తాజాగా జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్ ఆదేశాల ప్రకారంగా నాన్ టెండర్ ద్వారా ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో మందుల సరఫరాకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సదరు కాంట్రాక్టర్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చూనాయక్‌ను సంప్రదించారు. 45 రోజులుగా కాలయాపన చేస్తుండటంతో వెంకన్న నెల రోజుల క్రితం లక్ష రూపాయలు ముట్టజెప్పారు. అయినా ఆర్డర్స్ ఇవ్వకపోవడంతో పదిహేను రోజుల క్రితం మరో లక్ష చెల్లించారు. అయినా తనకు వాటా సరిపోలేదని మరో రూ.3 లక్షలు కావాలని లచ్చూనాయక్ డిమాండ్ చేశాడు. దాంతో వెంకన్న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం ప్రకాశం బజార్‌లోని ఆయన నివాసంలో లచ్చూనాయక్‌కు వెంకన్న రూ.3 లక్షలు అప్పగిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం లచ్చూనాయక్ ఇంట్లో సోదాలు చేసి పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

భిక్కనూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం

- ఫ్లెక్సీ వివాదంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడి
- ఠాణాలోనే చేయిచేసుకున్న వైనం

భిక్కనూరు, ఫిబ్రవరి 16: ఫ్లెక్సీ వివాదంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అధికార పార్టీ నాయకులు పోలీసుల ముందే చేయిచేసుకున్నారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మాజీ మంత్రి షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా బస్వాపూర్‌లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని బుధవారం రాత్రి ఎవరో చింపేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలపై గురువారం ఫిర్యాదు చేయగా, ఎస్సై సాయికుమార్ పలువురిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తుడం జీవన్ రెచ్చిపోయి సదరు బీఆర్‌ఎస్ కార్యకర్తలపై చేయిచేసుకున్నారు. ఈ విషయం బయటికి తెలియడంతో సదరు కార్యకర్తల కుటుంబ సభ్యులు, నాయకులు శుక్రవారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. కాంగ్రెస్ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటికే భీంరెడ్డి, తుడం జీవన్‌ను అదుపులోకి తీసుకొని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

15 వేల కొత్త పోలీసు కొలువులు ఉత్తదేనా?

- కేసీఆర్ హయాంలో ఎంపికైన వారికే నియామక పత్రాలు
- పోలీసు ఉద్యోగార్థుల ఆశలపై నీళ్లు చల్లిన సీఎం రేవంత్‌రెడ్డి
- నోటిఫికేషన్ వస్తదేమోనని ఆశగా ఎదురుచూస్తున్న ఉద్యోగార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): జనవరి 31న ఎల్బీ స్టేడియంలో వేల మంది సాక్షిగా.. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డి.. త్వరలోనే 15వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి.. కొత్త పోస్టులు భర్తీ చేస్తామని చేసిన ప్రకటన ఉత్త ముచ్చటేనని తెలుస్తున్నది. ఇటీవల సీఎం రేవంత్ మరోసారి 15వేల కొత్త పోలీసుల ఉద్యోగాల గురించి ప్రకటించారు. దీంతో 46 జీవోతో అన్యాయానికి గురైన కానిస్టేబుల్ అభ్యర్థులు.. గత నోటిఫికేషన్‌లో చివరి వరకూ అర్హత సాధించలేని నిరుద్యోగులు ఒక్కసారిగా ఆశలు పెంచుకున్నారు. అయితే, తమ నమ్మకాన్ని వమ్ము చేస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం చేసిన ప్రకటన తీవ్ర నిరాశకు గురిచేసిందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నోటిఫికేషన్ ద్వారా కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 13,444 మందికి ఇటీవల ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందిస్తూ.. త్వరలో మరో రెండున్నర వేల మందికి నియామక పత్రాలు అందించడం ద్వారా 15వేల పోలీసు ఉద్యోగాలు పూర్తవుతాయని సీఎం ప్రకటించడం పట్ల నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త నోటిఫికేషన్ ఎప్పుడు?

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగాలకు నియామక పత్రాలు అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అంటున్నారే తప్ప.. కొత్త నోటిఫికేషన్ వేస్తానని మాత్రం చెప్పడం లేదని నిరుద్యోగులు అంటున్నారు. నియామక పత్రాల సభల్లో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని నిరుద్యోగులను కోరుతున్న సీఎం.. కొత్త నోటిఫికేషన్లు ఎప్పుడు వస్తాయో మాత్రం చెప్పడం లేదని నిరుద్యోగులు నిరుత్సాహపడుతున్నారు. కేసీఆర్ ఇచ్చిన 16వేల కానిస్టేబుల్ ఉద్యోగాలే ఫైనలా? లేక 15వేల పోలీసు ఉద్యోగాలకు కొత్త నోటిఫికేషన్ ఏమైనా ఇస్తున్నారా? అన్న విషయాన్ని స్పష్టం చేయాలని పోలీసు ఉద్యోగార్థులు కోరుతున్నారు. ఇక ఫిబ్రవరి ఒకటో తేదీ నాటికే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి.. 16వ తేదీ వచ్చినా అతీ గతీ లేదని బాధపడుతున్నారు.

ప్రభుత్వ జోక్యం ఎక్కడ?

కేసీఆర్ హయాంలో ఎన్నికల కోడ్ కారణంగా ఫలితాల విడుదలలో జాప్యం జరిగితే.. వాటిని కూడా సీఎం రేవంత్‌రెడ్డి కోర్టు కేసులకు ముడిపెట్టి సభల్లో పచ్చి అబద్ధాలు వల్లవేస్తున్నారు. ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన నర్సింగ్ ఆఫీసర్స్, గురుకుల, సింగరేణి ఉద్యోగ నియామకపత్రాలకు ఎట్లాంటి కోర్టు చిక్కులు లేవు. ఉన్నదల్లా ఒక్క కానిస్టేబుల్ నియామకాల్లోనే. అది కూడా గత అక్టోబర్‌లో విడుదల చేసిన ఫలితాలపైనే. కొందరు అభ్యర్థుల అభ్యంతరాల మేరకు హైకోర్టు నిపుణుల కమిటీ వేయగా.. ఆ కమిటీ సైతం కేసీఆర్ హయాంలో విడుదల చేసిన ఫలితాలకే మొగ్గు చూపింది. అయితే, అప్పటికే బోర్డు అధికారులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి.. ఒక్కో చిక్కుముడి ఎక్కడ విప్పారు? అనేది కానిస్టేబుల్ ఉద్యోగార్థులను వేధిస్తున్న ప్రశ్న. విడుదలైన ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు ఇవ్వడం మాత్రమే ఆయన చేశారని అంటున్నారు. ఇకనైనా పోలీసు ఉద్యోగార్థులకు కొత్త నోటిఫికేషన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య

- నామినేటెడ్ పదవుల నియామకాలు షురూ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పందేరానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ఆర్థిక కమిషన్ చైర్మన్‌గా వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అజ్మతుల్లా హుసేన్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ అధికారిక తెలంగాణ మాస పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా కోడూరి శ్రీనివాస్‌రావును నియమించింది. స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌లో సభ్యులుగా ఎం రమేశ్, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, మాలోత్ నెహ్రూ నాయక్‌ను నియమించింది. రెండు మూడు రోజులలో మరిన్ని నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కానున్నట్టు తెలిసింది.

యవ్వనంలోనే 'గుండె' గండం

రాష్ట్రంలో ఒకేరోజు నలుగురి మృతి.. • మృతుల్లో ఇద్దరు వైద్యులు, ఓ విద్యార్థి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు 60 ఏండ్లు దాటిన వారిలో అరుదుగా కనిపించే గుండెపోటు ఇప్పుడు 30 ఏండ్లు దాటని వారిలో కూడా ప్రత్యక్షమవుతున్నది. నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన రేడియాలజిస్ట్ డాక్టర్ చింతల భరత్‌రెడ్డి (34) శామీర్‌పేట మండలం, బొమ్మరాశిపేటలోని లియోనియా రిసార్ట్‌లో స్నేహితుడి రిసెప్షన్‌కు వెళ్లి, గుండెపోటుతో శుక్రవారం కుప్పకూలిపోయాడు. మరో ఘటనలో శుక్రవారం ఉదయం కర్నూలుజిల్లాకు చెందిన అనస్తీషియా డాక్టర్ శ్రవణ్(38) గుండెపోటుకు గురై మృత్యువాతపడ్డాడు. హైదరాబాద్ చెందిన షేక్ ముజమ్మిల్ అహ్మద్ (25) కెనడాలో గుండెపోటుకు గురయ్యాడు. ఐటీలో ఎంఎస్ చేయడానికి ఆయన 2022లో కెనడా వెళ్లాడు. స్థానికంగా ఉన్న కనెస్టోగ కాలేజ్, వాటర్లూ క్యాంపస్‌లో ఎంఎస్ చేస్తున్న అహ్మద్ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం అతడికి తీవ్ర గుండెపోటు రావడంతో మృతిచెందినట్టు కెనడా నుంచి అతడి స్నేహితులు నగరంలోని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ముజమ్మిల్ మృతదేహాన్ని భారత్ తరలించేందుకు సహాయం చేయాలని కుటుంబసభ్యులు విదేశాంగ మంత్రి జైశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లాలో లింగారెడ్డి అనే ఎస్‌ఐ కూడా గుండెపోటుకు గురయ్యారు. ఈ వరుస ఘటనలు బాధిత కుటుంబాలను శోక సంద్రంలో ముంచివేశాయి. కరోనా తరువాత 30 నుంచి 40 ఏండ్ల వయస్సు లోపు వారే ఎక్కువగా గుండెపోటుకు గురవుతున్నట్టు వైద్యనిపుణులు చెబుతున్నారు. దీనికి గల కచ్చితమైన కారణాలపై అధ్యయనాలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. గత నెల రోజుల వ్యవధిలో పదేండ్లు సైతం నిండని చిన్నారులు కూడా గుండెపోటుతో మృత్యువాత పడటం గమనార్హం.

బదిలీపై వచ్చిన మరుసటి రోజే..

రాంనగర్, ఫిబ్రవరి 16: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన లింగారెడ్డి (56) అనే ఎస్‌ఐ బదిలీపై వచ్చిన మరుసటి రోజే గుండెపోటుతో మృత్యువాత పడ్డారు. కామారెడ్డి జిల్లా నుంచి గురువారం బదిలీపై వచ్చి కరీంనగర్ సీసీఆర్‌బీలో విధులకు రిపోర్ట్ చేశారు. అయితే, శుక్రవారం ఉదయం తిరుమలనగర్‌లోని తన ఇంట్లో ఆకస్మికంగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

శుక్రవారం దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్

- మాజీ మేయర్ రామ్మోహన్, హీరో అల్లు అర్జున్ మామ కూడా..
- సీఎం రేవంత్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వీరిద్దరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తన భార్య, వికారాబాద్ జడ్పీ చైర్మన్ సునీతరెడ్డితో కలిసి మొదట గాంధీభవన్‌కు చేరుకొని పార్టీలో చేరారు. అనంతరం సునీతరెడ్డి శాసనసభ ప్రాంగణానికి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. మరోవైపు విద్యాసంస్థల అధినేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి (సినీ హీరో అల్లు అర్జున్ మామ) కూడా శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. శాసనసభ ఎన్నికల్లో మునుగోడు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన చల్లమల్ల కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిసి తాను కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తిగా ఉన్నట్టు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కూడా శుక్రవారం అసెంబ్లీకి వచ్చి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరబోతున్నట్టు ఆయన మీడియాకు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎస్సీ రిజర్వుడ్ స్థానం నుంచి తనకు టికెట్ ఇస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని రాజయ్య చెప్పారు.

నేటి విద్యార్థులే రేపటి మానవ వనరులు

- కేఎల్‌యూ స్కాలర్‌షిప్‌ల పంపిణీలో మంత్రి సీతక్క
- 'కేఎల్ మాట్-2024' పరీక్ష ఫలితాలు విడుదల

దుండిగల్, ఫిబ్రవరి 16: నేటి విద్యార్థులే రేపటి దేశాభివృద్ధికి ఉపయోగపడే మానవ వనరులని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట (బాచుపల్లి)లోని కేఎల్ యూనివర్సిటీ (కేఎల్‌యూ)లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆ వర్సిటీ యాజమాన్యం అందించే రూ.100 కోట్ల మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం హర్షణీయమని తెలిపారు. కేఎల్‌యూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అద్భుతమైన ప్లేస్‌మెంట్లను అందిస్తున్నదని అభినందించారు. అనంతరం ఆమె వర్సిటీలో మౌలిక వసతులను, పరిశోధనా కేంద్రాలను పరిశీలించారు. అంతకుముందు కేఎల్‌యూ క్యాంపస్‌లలో పీజీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన 'కేఎల్ మాట్–2024' పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కార్యదర్శి కోనేరు కాంచనలత, వర్సిటీ వైస్–చాన్స్‌లర్ డాక్టర్ ఎన్ వెంకట్రామ్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జే శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న టీఎన్జీవో నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట టీఎన్జీవోల నిరసన

హాజీపూర్, ఫిబ్రవరి 16 : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. టీఎన్జీవో ఆధ్వర్యంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలపై కాల్పులు

మూసాపేట (అడ్డాకుల), ఫిబ్రవరి 16 : అర్ధరాత్రి వేళ వీధి కుక్కలపై కాల్పుల ఘటన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో కలకలం రేపింది. ఈ ఘటనలో 20 కుక్కలు మృత్యువాత పడ్డాయి. అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో పొన్నకల్ గ్రామానికి ఓ కారులో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు తుపాకులతో వచ్చారు. ముందుగా మసీద్ వద్ద ఉన్న కుక్కపై కాల్పులు జరిపారు. తర్వాత వీధుల్లో తిరుగుతూ శునకాలపై కాల్పులు జరిపారు. కాల్పుల శబ్దంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో స్థానిక ఆలయంలో నిద్రిస్తున్న శివ మాలధారులు రాజు, ఆంజనేయులు మేల్కొని గుర్తుతెలియని వ్యక్తులను చూసి భయపడ్డారు. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేకపోయారు. పొద్దున లేచి చూసే సరికి 20 కుక్కలు మృత్యువాతపడగా, మరో ఐదు గాయపడినట్టు స్థానికులు తెలిపారు. వారి వద్ద లేజర్ లైట్స్‌తో కూడిన తుపాకులు ఉన్నట్టు గుర్తించానని రిటైర్డ్ ఆర్మీ జవాన్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ రామకృష్ణ గ్రామానికి చేరుకొని క్లూస్ టీం ద్వారా ఆనవాళ్లను, రెండు బుల్లెట్ కోక్స్‌ను సేకరించారు. అనుమానంతో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రాజవర్ధన్‌రెడ్డి వద్ద ఉన్న తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.